


# నను తాకేసిందిరా 'కాలాజాన్వర్'

'రరరేయ్... తొయ్యబాకరా... తొయ్య బాకా... రరెయ్... నీయవ్వ దొంగ నాయాలా....' అన్నాను ఏడుపు మొకం పెట్టి.

పొళ్లన్నీ అవుపడేలా 'కిక్కి-క్కీ-క్కీ-' అని నవ్వుతా ఉన్నాడు సతీష్‌సింగుగాడు- నన్ను పంది మీదికి తోసేసి.

ప్రైతీసారీ వాడికిదో కిండలు! ఇస్కూలు విడిచినాక నా మానన నేను యింటికి పోతా ఉంటే నా పక్కనే నడిచినట్టుగా నడిచి పంది మీదకి నెట్టేస్తా వుంటాడు.

నేను అదిరిపడి పక్కకి దూకి- క్యావుబ్యావుమంటా అటూ ఇటూ ఎగరతా ఉంటే వాడికి తమాషా.

కానీ ఎన్నిసార్లని తప్పించుకునేది?

ఈసారి వాడు తొయ్యడానికీ నేను అరవడానికీ సరిగ్గా సరీపోయి, గమ్మున పోతా వున్న పందికి కూడా బెదురుపుట్టి, తత్తరలో ఎటుపోవాలో తెలీక మీదకొచ్చేసింది. ఆ రావడం రావడం దాని కడుపు నా కాలిని తాకేసింది.

పస్టు 'పచక్' మని చిమ్మింది బురద!

అనేక దాని తడితడి బొచ్చు చర్మం మెత్తగా నా ఒంటికి రుద్దుకునింది.

అబ్బ. నా ఒంట్లో వికారం పుట్టింది చూడూ... కడుపులో లొడలొడమని చెయ్యి పెట్టి లోడేసినట్టు అనిపించి వాంతికొచ్చేసింది. గబుక్కున ఏ బావిలోనైనా దూకి శుబ్రం చేసేసుకుందామా అన్నంత రోత పుట్టింది.

నాకు తెలియకుండానే కళ్లమ్మట నీళ్లు తిరిగినాయి. ఏడుపొచ్చేసింది!

నా ఏడుపూ నా అవస్తా చూసేసరికి సతీష్ సింగుగాడి మొకంలో నవ్వు మాయమై పోయింది. వాడు నా దగ్గిరకొచ్చి 'ఐయాం సారీరా... ప్లీజ్‌రా.. సారీరా... పదరా కుళాయికాడ కడుక్కుందువుగానీ' అన్నాడు బుజం మీద చెయ్యేస్తా.

వాడి నంగమాటలకి యింత పొడుగున పొడుచుకొచ్చేసింది పౌరుషం!

'చేసింది చాలుగానీ ఒదులోరే దొంగనాయాలా. యిప్పుడు కాదు నీ పని... రేపు చెబుతా. మాల్యాద్రయివోరితో చెప్పి నీ పని వాంపూస చేయించకపోతే అప్పుడు చూడయ్యా....' అని, ఏడ్చుకుంటానే యింటి దారి పట్టినాను.

దారి పొడుగూతా నా బాద బాద గాదు. మనసులో ఏందేందో బయాలు. 'పంది తాకితే బలే దోషం సామీ. ఏడు బావుల నీళ్లతో స్నానం చేస్తేగానీ ఆ దోషం పోదు' అని మా వీదిలోని పిలకాయలు చెప్తా ఉండిన మాటలు గెవనానికి వస్తా ఉన్నాయి. వాళ్ల లెక్క ప్రకారం మా కసాబ్ గల్లీలో ఏడు బావులు యాడాడ ఉన్నాయా అని లెక్కేసినాను కాసేపు.

మళ్లా... షమ్మీ వాళ్ల అన్న ఖాదర్‌బాషా గుర్తుకొచ్చినాడు. వాణ్ణొకసారి పంది తాకిందని తెలిసి వాళ్లమ్మ ఖుర్షీద్‌బీ మూడు పగళ్లూ మూడు రాత్రిళ్లూ తిడతానే వుంది వాణ్ణి.

'అయి పొర్లేకాడ ఆడతావా? ఆడతావా?' అంటా వాడి చమిడీ వొలిచేసి వొదిలిపెట్టింది. (ఖుర్షీద్‌బీ పందిని 'పంది' అనదు. ఆమే కాదు మాలో చాలా మంది కూడా 'పంది' అనే పదాన్ని నేరుగా నోటి మీదకి తేరు. అంటే ఆ మాట పలకడం కూడా మాలో నిషిద్ధమన్నమాట. ఒకేల దాని ప్రస్తావన తేదలిస్తే 'కాలా జాన్వార్' అని అంటారు. అంటే నల్లజంతువు- పంది అని అర్దం. మా బాషలో 'పంది'కి యింకో మాట కూడా వుంది- 'సువ్వర్' అని).

ఆ తన్నులు గుర్తుకొచ్చేసరికి బలే బయమైపోయింది నాకు. అసలికి యీ సంగతి యింట్లోనే చెప్పకపోతే? అని అనిపించింది.

మళ్లా అనుమానం. ఏమో.. ఎందుకొచ్చిన దోషం. యిట్లాంటివి యింట్లో చెప్పి ప్రాయచ్చిత్తం చేయించుకోకపోతే సొర్గద్వారాలు మన కోసం శాశ్వితంగా గెడియ

పడిపోతాయేమో కదా! అని పరలోక బీతి వచ్చింది.

ఆఖరకు ఎట్టయితే ఏమి- పంది తాకిందన్న సంగతి యింట్లో చెప్పితీరాల్సిందే అని నిచ్చయించుకొని యింటికి చేరినాను. అయితే ఎమ్మట్నే గడపలోకి అడుగుపెట్టలేదు.

'మోవ్... అమోవ్' అన్నాను బయిట్నించి.

నా కేక విని మా నాయినమ్మ బయిటికొచ్చింది.

నా ఏడుపు మొకం, కాలికంటిన బురదా చూసి 'ఏందిరా నాయినా... ఏందో చేసుకొచ్చినావే' అనింది గాబరాగా. నేను బయం బయంగా మొకం పెట్టి, గోర పాపమేదో చేసిన వాడిలాగా 'పంది తాకేసింది మా' అన్నాను.

'ఆరి మౌలా... తాకేసిందా! ఆణ్ణే ఆగు. లోపలికి రాబాకా' అని గబగబా యింట్లోకి వెళ్లింది మా నాయినమ్మ.

లోపల్నించి మాటలినిపిస్తా ఉన్నాయి.

'ఏందంట వాడిదా?' అంటా ఉంది మా అమ్మ.

'పంది తాకిందంటలే. నువ్వేమీ అనబాక. అసలికే దడుసుకొని ఉన్నాడు బిడ్డ' అని బిందెడు నీళ్లు తెచ్చింది మా నాయినమ్మ.

'నీళ్లు బోస్తాను. పక్కకిరారే' అంటా నన్ను సైడు కాలవ దగ్గిర నిలబెట్టింది.

'గుడ్డలిప్పబాక. అయికూడా తడవాలి' అని చెంబు నిండుగా నీళ్లు తీసుకునింది.

ఆ చెంబు కాణ్ణుంచి బిందెలోని నీళ్లయిపోయే ఆఖరి చెంబు దాకా.. రెండు నిమిషాలకొక తడవ ఏందో మంత్రం చదవడం, ఆ మంత్రం ప్రబావాన్ని చెంబులోని నీళ్లలోకి విడుస్తున్నట్టుగా 'షు..షు...' అని వూదడం, నా నెత్తిన కుమ్మరించడం.. యిదే పని. (అప్పటికి ఏడు బావుల నీళ్లు పోసేంత చాదస్తం మా నాయినమ్మకు లాకపోవడం మంచిదయ్యింది. లాకుంటే అన్ని స్నానాలు చేయలాక కాగితం నానినట్టుగా నానిపొయ్యుండే వాణ్ణి).

శుద్ధి స్నానం పూర్తిగా ముగిసినాక తువ్వాలు తెచ్చిస్తా 'గుడ్డలాణ్ణే యిప్పేసి లోపలికిరా' అనింది మా నాయినమ్మ. తువ్వాలు కట్టుకొని గుడ్డలిప్పేసినాక -కట్టెపుల్లతో వాటిని దూరంగా పైకెత్తి బావికాడ తీసుకెళ్లి పడేసింది.

అంతటితో పంది తాకిందన్న బాద తీరి, దోషం పోయి, కత ముగిసిందని ఊపిరి పీల్చుకుంటా ఉంటే మా అమ్మ రంగప్రవేశం చేసింది.

'రా నాయినా... రా.... నీ కోసరమే చూస్తున్నా' అంది కట్టెత్తుకుంటా.

మా నాయినమ్మ అడ్డం పడింది.

'ఉరుకోమ్మే! వాడేమన్నా కావాలనిపోయి తాకొచ్చినాడా? దాని మీదకెక్కి డాన్సాడినాడా? దానిపాటికదే వచ్చి మీద పడిందంట' అనింది.

అన్నాక- మా అమ్మను తమాషా పట్టిస్తున్నట్టుగా నవ్వింది.

'అయినా పందొచ్చి తాకిందంటే తాకదా? అన్నదమ్ముల ప్రేమ చూపమంటే చూపదా? ఇదంతా మీ అవ్వ పెట్టిన దీవెన మహిమేగా' అనింది మా అమ్మతో.

ఆ మాటలకి కట్టె అవతల పారేసి 'మొదలయ్యిందండి ఈమె గారి కిండలు' అని మూతి ముడుచుకుంటా వెళ్ళిపోయింది మా అమ్మ.

మా నాయినమ్మ మళ్లా నవ్వింది!

ఆ నవ్వు చూసేసరికి యీడేందో పంది కతున్నట్టుందే అని అర్థమైపోయింది నాకు. ఆ రాత్రి సైగ్గా మా అమ్మ పక్కలో చేరినాను. కాసేపు తాలినాక- 'సాయింత్రం ఏందిమా నీతో తమాషా చేస్తా ఉంది నాయినమ్మ... ఆ కతేందో చెప్పవా మా' అని బతిమిలాడినాను.

అప్పుడు మా అమ్మ ముసిముసిగా నవ్వతా 'అది తమాషా కాదురా... నిజ్జంగానే మా వొంశానికి మా అవ్వ పెట్టిన సల్లటి దీవెన' అని యిట్టా కత మొదలెట్టింది.

'యిది యిప్పటిది కాదులే... మా అమ్మ కూడా పుట్టనప్పటి కత. మా తాత (అమ్మ నాయిన) అల్లిసాయిబుది బాగా బతికిన వొంశం. అయితే ఆయన చిన్నతనంలోనే పెద్దోళ్లు సంపాదించిన ఆస్తులన్నీ కరిగిపోయినాయంట. పూటకు గతిలేని పరిస్థితి వచ్చిపడిందట. సరిగ్గా ఆ టైములోనే మా అవ్వ మాహుబీ (అల్లిసాయిబు సొంత అక్క) యిరవై ఏళ్లకే విదవరాలయ్యి తమ్ముడి పంచన చేరింది. అప్పటికి మా తాత వొయసు ఎంతనీ? పదిహేడు సంవత్సరాలు. ఒక తట్టు విదవరాలైన అక్క, యింకోతట్టు చేతగాని యిద్దరన్నల్ని చూసుకుని యింకో ఆసరాలాక ఇంటి బరువు నెత్తికెత్తుకున్నాడంట మా తాత. మా అవ్వ కూడా మా తాతకు అక్కలా గాకుండా తల్లిలా కనిపెట్టుకుని ఉండి పొయ్యిందంట. అప్పట్నించి మా తాతకు మా అవ్వమాట మీదనే గురి. ఆమె ఏమి చెబితే అదే చేసే వాడంట మా తాత.

కొంతకాలానికి కంసాలి పని నేర్చుకొని... నెమ్మదిగా నాలుగు గిరాకీలు పట్టి.. పెళ్లయినాక సొంతంగా అంగడి పెట్టుకొని డబ్బులు కూడబెట్టినాడు మా తాత. ఆ డబ్బుతో ఇల్లు కొందామనుకొని వరవకట్ట కాడ ఒక యిల్లు బేరం చేసినాడు. అయితే యీ మాట

అక్కతో చెప్పాలి గదా. అందుకని యింటికొచ్చి- 'అకా! యిట్టా ఒకిల్లు బేరానికి వచ్చుంది. అయితే అది పందుల్ని పెంచే ఒడ్డోనిది. మనం చూస్తే సాయిబులమి. పందులు పొర్లాడిన అట్టాంటి ఇంటిని కొనాలా వద్దా? అని అనుమానంగా వుందకా' అన్నాడంట.

అప్పుడు మా అవ్వ బాగా ఆలోచించి -నాయినా! వడ్డోని ఇల్లంటున్నావు... పందులు పొర్లాడాయంటున్నావు. యీ మాటలే నిజమైతే ఎమ్మటన్నే ఆ ఇల్లు కొనెయ్యి. పంది కడుపు ఎంత చలవో ఆ యింట్లో పుట్టి పెరిగే నీ వొంశం కూడా అంతే చలవవద్ది. నీకు బిడ్డలు పుట్టి, వాళ్లకు బిడ్డలు పుట్టి నీ వొంశెం కళకళలాడతది... అని దీవించిందంట. మా తాత ఆ యిల్లు కొన్నాడు. మా అవ్వ దీవెన నిజమైంది. అప్పట్నించి మా వొంశంలో పిల్లల్లేని వాళ్లెవరూ లేరు. మీ నాయినోళ్ల వంశెంలో ఒకటికి రెండున్నా అట్టాంటి కేసులున్నాయిగానీ మాకు ఆ బాదలా. మా తాతకు నలుగురు కూతుర్లు పుట్టినారు. వాళ్లలో ఒకోకరికి నలగరికి తక్కువ కాకుండా బిడ్డలు పుట్టినారు. ఆ బిడ్డలకి మళ్లా బిడ్డలు పుట్టినారు. మా అమ్మ ఆరుగురిని కంటే ఆమెకు పుట్టిన నేను మీ నాయిన పాలబడి నలగరిని కనివిడిచినాను. నాకు పుట్టిన నువ్వు రేపు పెద్దయినాక పెళ్లి చేసుకొని పుట్టాసాలగా మందిని కంటావు...' అని కత ముగించింది మా అమ్మ.

(మా అమ్మ చెప్పిన పంది చలవ కత ప్రకారం మా అమ్మోళ్ల అవ్వ అట్టాంటి దీవెనే యిచ్చుంటే ఇప్పుడామె ఆత్మ ఎంతగా క్షోబిస్తా ఉందో ఏమో! ఎందుకంటే ఒకరికి నలగర్ని కనే హయాము మా అమ్మ తరంతోటే అంతమయిపోయింది మా ఇళ్లల్లో. ఇప్పుడంతా కట్టే కట్టు. మా పిన్నికి యిద్దరు బిడ్డలు. కట్టు. మా పెద మేనమామకు యిద్దరు బిడ్డలు. కట్టు. చిన మేనమాకు ఒకడు పుట్టినాడు. యింకొకడు పుట్టకముందే కట్టోకట్టు అంటా ఉన్నాడు. మా పెదమ్మ కూతురికి కూడా యిద్దరే బిడ్డలు. వీళ్లేకాదు మా అమ్మోళ్ల వొంశంలో యిప్పుడు మా తరం వోళ్లంతా 'ఒకరా? యిద్దరా?' అనేవాళ్లే తయారైనారు. ఎప్పుడైనా వీళ్లతో తమాషాగా 'యింకొకర్ని కనకూడదా?' అనంటే 'ఒకర్ని సాకేసరికే దేవుడు అవుపిస్తా ఉన్నాడు... యిద్దరు ముగ్గురు దేనికి నాయినా... కూటికీ గుడ్డకీ నకనకలాడడానికా? నువు కూడా పెళ్లి చేసుకొని కను. అప్పుడు పులుసుకారి నీకే తెలుస్తుంది' అంటారు అక్కసుగా).

